క్లుప్తంగా

ఘనంగా ముగిసిన వారాహి నవరాత్రులు



ప్రత్యేక అలంకరణలో వారాహి మాత అమ్మవారు

పెదపూడి: జి.మామిడాడలో బుల్లి బాపనమ్మ గుడి వీధిలో ఉన్న సిరి అమ్మ ఇంటి వద్ద వారాహి మాత నవరాత్ర మహోత్సవాలు మంగళవారంతో ఘనంగా ముగిశాయి. సిరిమాత భక్తులకు అమ్మవారి కుంకుమ, గాజులు అందజేశారు. అనంతరం అమ్మవారి పీఠం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. జి.మామిడాడతో పాటు పరిసర గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పూజల్లో కిరణ్, నల్లమిల్లి శ్రీనివాస్, బాబిరెడ్డి, ద్వారంపూడి యువరాజారెడ్డి, శశి, సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆషాఢ మాసం రెండో మంగళవారం దశమి సందర్భంగా స్వామివారికి అర్చకులు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో అన్నసమారాధన చేశారు.

గడ్డి మందు పిచికారీ



మర్రిపూడిలో గడ్డి మందు పిచికారీ చేస్తున్న కార్మికులు

రంగంపేట: మండలంలోని మర్రిపూడి గ్రామంలో సర్పంచ్ వేము మాధవి ఆధ్వర్యంలో మంగళవారం పారిశుధ్య పనులు చేపట్టారు. సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్న నేపథ్యంలో డ్రైనేజీల్లో పూడిక తొలగించి దోమల నివారణకు గడ్డి మందు పిచికారీ చేయించారు. ప్రజలంతా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ వేము మాధవి సూచించారు.

పుష్కర గట్టుపై కొబ్బరి మొక్కలు

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడిలో మంగళవారం ఉపాధిహామీ పథకం కూలీలు 250 కొబ్బరి మొక్కలు నాటారు. మండలంలోని పలు గ్రామాల్లో కాలువలు, చెరువు గట్లపై ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. పుష్కర కాలువకు ఇరువైపులా ఈ మొక్కలను నాటారు.

18న ప్రతిభా పురస్కారాల ప్రదానం

మధురపూడి: రావిపాటి శ్రీనివాసరావు స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 18న రావిపాటి ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నట్టు సంస్థ ప్రధాన కార్యదర్శి కోలా సత్యనారాయణ మంగళవారం ఇక్కడ తెలిపారు. 2014లో రూ.6 లక్షల ఫిక్సిడ్ డిపాజిట్‌ను కోరుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఇచ్చినట్టు చెప్పారు. దానిపై వచ్చే వడ్డీతో ఏటా విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ఇస్తున్నామన్నారు. ఈ ఏడాది 17 మంది విద్యార్థులకు నగదు, సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేస్తామన్నారు. కార్యక్రమానికి డీఈఓ వాసుదేవరావు ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు.

సర్పంచ్‌లకు రేపు అవగాహన కార్యక్రమం

సీతానగరం: ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకంపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం 2.30కు సర్పంచ్‌లకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ కె.కృష్ణప్రసాద్ మంగళవారం తెలిపారు. ఆయా గ్రామాల్లో చేతివృత్తుల కార్మికులను ప్రోత్సహించడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలి

పెదపూడి: అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల స్థాయి అధికారులందరితో అభివృద్ధి పనులపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు అందుబాటులో లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.ఆశాజ్యోతి, మాజీ ఎంపీపీ జుత్తుక సూర్యకుమారి, మాజీ సొసైటీ చైర్మన్ పుట్టా గంగాధర్ చౌదరి ఆర్.నాగు తదితరులు పాల్గొన్నారు.

మోతాదు మించితే ముప్పే

- విచ్చలవిడిగా రసాయనిక ఎరువుల వినియోగంతో అనర్థాలెన్నో..!
- సమతుల్యత పాటించాలంటున్న వ్యవసాయ శాఖ అధికారులు



పెదపూడిలో పొలంలో ఎరువులు చల్లుతున్న రైతు

పెదపూడి: కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో వరినాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. వరి నాట్లు వేసే పనిలో అన్నదాతలు బిజీబిజీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎరువుల వినియోగం, సాగు యాజమాన్య పద్ధతులపై వ్యవసాయశాఖ అధికారులు రైతులకు పలు సూచనలు చేస్తున్నారు. భూసార పరీక్ష ఫలితాలకు అనుగుణంగా ఎరువులు వేసుకుంటే సాగు ఖర్చు తగ్గడంతో పాటు అధిక దిగుబడులు పొందవచ్చంటున్నారు. ఎరువుల మోతాదు మించితే భూమి నిస్సారంగా మారడంతో పాటు దిగుబడులపై ప్రభావం చూపుతుందని చెబుతున్నారు.

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో అనపర్తి నియోజకవర్గంలోని పెదపూడి, అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాల్లో మొత్తంగా 45,500 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. అనపర్తి మండలంలో 12,000 ఎకరాలు, పెదపూడి మండలంలో 18,500 ఎకరాలు, రంగంపేట మండలంలో 2,000 ఎకరాలు, బిక్కవోలు మండలంలో 13,000 ఎకరాల్లో సాగు చేపట్టారు. ఖరీఫ్‌కు సంబంధించి ఇప్పటివరకూ నియోజకవర్గంలో సుమారు 45 శాతం మేర వరి నాట్లు వేసినట్లు అధికారులు చెబుతున్నారు. నత్రజని, పొటాష్, భాస్వరం, జింక్ సల్ఫేట్ తదితర ఎరువులను భూసార పరీక్షల ఆధారంగా వాడుకోవాలని వ్యవసాయ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. అదే నీటి ఎద్దడి ఉన్న పంట ప్రాంతాల్లో వెదజల్లే పద్ధతిలో వరి సాగు ఉత్తమం. వెదసాగులో కలుపు నివారణ చర్యలు చేపట్టాలి. అనంతరం నీటి నిల్వలను బట్టి యూరియా, భాస్వరం, పొటాష్ ఎరువులను వ్యవసాయ సిబ్బంది సిఫార్సు మేరకు వినియోగించుకోవాలి.

నత్రజని

నత్రజని కాంప్లెక్స్ ఎరువుల రూపంలో లేదా యూరియా రూపంలో లభిస్తుంది. పంట ఎదుగుదలకు, పచ్చగా ఉండేందుకు నత్రజని దోహదపడుతుంది. దీనిని మూడు భాగాలుగా వేసుకోవాల్సి ఉంటుంది. మొదటి భాగాన్ని దమ్ములో 20 కిలోలు, రెండో భాగాన్ని పిలకలు వేసే దశలో 20 కిలోలు, మూడో భాగాన్ని అంకుర దశలో 20 కిలోలు చొప్పున వేసుకోవాలి.

భాస్వరం

మొక్కల వేర్లు బలంగా ఉండేందుకు దమ్ము సమయంలో భాస్వరాన్ని వాడతారు. లేనిపక్షంలో నాట్లు వేసిన వారం రోజుల్లోపు వేయాలి. భాస్వరం అందించే క్రమంలో దమ్ములో మూడు బస్తాల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ రూపంలో గాని లేదా 50 కిలోల డీఏపీనిగా వేయాలి. ఇలా వేసిన తరుణంలో పొటాష్‌ను దమ్ములో 20 కిలోలు వేస్తే సరిపోతుంది.

పొటాష్

పొటాష్ వల్ల ఆకులు గరుకుతనం కలిగి ఉండడమే కాకుండా గింజ గట్టిపడేందుకు దోహదపడుతుంది. వరికి చీడపీడల బెడద తగ్గుతుంది. పొటాష్‌ను దమ్ములో 25 కిలోలు, అంకుర దశలో 20 కిలోలు చొప్పున వేసుకోవాలి.

జింక్

జింకును దమ్ములో ఎకరాకు 40 కిలోలు చొప్పున వేసుకోవాలి. జింక్ లోపాన్ని పంట చేనులో గుర్తిస్తే వంద లీటర్ల నీటిలో 10 గ్రాముల జింక్ సల్ఫేట్ పౌడర్‌ను కలిపి పిచికారీ చేసుకోవాలి.

విచక్షణ రహితంగా వినియోగించొద్దు

రైతులు విచక్షణ రహితరంగా ఎరువులు, పురుగు మందులను వినియోగించడంతో సాగు ఖర్చు పెరిగిపోవడంతో పాటు భూమి నిస్సారం అవుతుంది. భూసార పరీక్షలు చేయించుకుని వాటి ఫలితాలకు అనుగుణంగా వ్యవసాయశాఖ సిబ్బంది సూచనల మేరకు తగిన మోతాదులో మాత్రమే ఎరువులు వేసుకోవాలి. ఇలా చేయడంతో సాగు ఖర్చు తగ్గడంతో పాటు అధిక దిగుబడులు సాధించ వచ్చు.

– టీవీఆర్ మణిదీప్, వ్యవసాయశాఖాధికారి, పెదపూడి మండలం

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



రంగంపేటలో స్టాప్ డయేరియా ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్య శాఖ సిబ్బంది

రంగంపేట: సీజనల్ వ్యాధులపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ పి. వెంకటరత్నం సూచించారు. మండల కేంద్రమైన రంగంపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి.వేణుశ్రీ లక్ష్మి ఆధ్వర్యంలో పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ, గ్రామీణ నీటిపారుదల, సచివాలయ సిబ్బంది కలిసి మంగళవారం స్టాప్ డయేరియా కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ నుంచి ఏడీబీ రోడ్డు వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏడీబీ రోడ్డు వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వెంకటరత్నం మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలంతా కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. ప్రతిఒక్కరూ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మండల వైద్యాధికారి వేణుశ్రీ లక్ష్మి మాట్లాడుతూ వర్షాకాలంలో కలుషితమైన నీరు, ఆహారం తినడం వల్ల డయేరియా వస్తుందన్నారు. అందుకే ప్రతిఒక్కరూ అవగాహనతో ఆరోగ్యం కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బలిరెడ్డి లక్ష్మి, ఉప సర్పంచ్ బలిరెడ్డి దుర్గారావు, ఐసీడీఎస్ పీఓ జె.జెస్సీఫ్లోరెన్స్, సీహెచ్‌ఓ కె.జయమణి పాల్గొన్నారు.

ఆర్యాపురం బ్యాంక్ అభివృద్ధే లక్ష్యం

వైఎస్సార్ సీపీ యువజన నేత జక్కంపూడి గణేష్



బ్యాంకు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న జక్కంపూడి గణేష్ తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: ది ఆర్యాపురం కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులోని ఖాతాదారులకు గతంలో కంటే మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా నందెపు శ్రీనివాస్ ప్యానల్ పని చేస్తుందని వైఎస్సార్ సీపీ ఉమ్మడి గోదావరి జిల్లాల యువజన విభాగం రీజనల్ కో–ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ అన్నారు. మంగళవారం స్థానిక తుమ్మలావ, కోర్లమ్మపేట, ఆర్యాపురం తదితర ప్రాంతాల్లో బ్యాంక్ ఎన్నికల ప్రచారంలో చైర్మన్ అభ్యర్థి నందెపు శ్రీనివాస్ ప్యానల్‌కు మద్దతుగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ ఆర్యాపురం బ్యాంక్‌కు ఘన చరిత్ర ఉందని, గత పాలకుల నిర్లక్ష్యం వల్ల బ్యాంకు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. చైర్మన్ అభ్యర్థి నందెపు శ్రీనివాస్ నాయకత్వంలో పోటీ చేస్తున్న డైరెక్టర్లందరికీ బ్యాంకుపై అన్ని విషయాల్లో పూర్తి అవగాహన ఉందన్నారు. ఈ ప్యానల్‌ను గెలిపిస్తే బ్యాంకు మరింత పురోగతి సాధిస్తుందన్నారు. ఆదర్శ బ్యాంకుగా తీర్చిదిద్దడానికి ఈ ప్యానల్ కృషి చేస్తుందని, ప్రతి ఒక్కరు నందెపు శ్రీనివాస్ ప్యానెల్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

బ్యాంకు ప్రతిష్టను ఇనుమడిస్తాం

చైర్మన్ అభ్యర్థి నందెపు శ్రీనివాస్ మాట్లాడుతూ గత పాలకవర్గంలో బ్యాంకులో ఎన్నో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. రాజమహేంద్రవరానికి, బ్యాంకుకు మచ్చ తెచ్చేలా గత పాలకవర్గం పనిచేసిందన్నారు. అవినీతి విషయంలో రికవరీ చేయాలని ఆదేశాలున్నా, హైకోర్టు నుంచి స్టేలు తెచ్చుకున్నారని చెప్పారు. అటువంటి వ్యక్తులు మళ్లీ బ్యాంక్ ఎన్నికల్లో పోటీ చేయడం సిగ్గుచేటన్నారు. బ్యాంక్ బిల్డింగ్ నిర్మాణంలో, సివిల్ పనుల్లో, స్థల కొనుగోలులో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. బ్యాంక్ ప్రతిష్ట ఇనుమడించేలా తమ ప్యానెల్ కృషి చేస్తుందని, బ్యాంకును కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు.

నన్ను గెలిపించండి: గంగిశెట్టి



రాజానగరం: ది ఆర్యాపురం కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ పాలకవర్గానికి ఈ నెల 20న జరిగే ఎన్నికల్లో హార్మనీ గుర్తుపై ఓటు వేసి తనను డైరెక్టర్‌గా గెలిపించాలని దివాన్‌చెరువు బ్రాంచ్ నుంచి పోటీ చేస్తున్న వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గంగిశెట్టి సోమేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. మండలంలోని పాలచర్లకు చెందిన ఆయన పార్టీ పరంగానే కాకుండా, ప్రజల్లో మంచి పేరును సంపాదించుకున్నారు. దివంగత నేత జక్కంపూడి రామ్మోహనరావుకు అనుచరునిగా ఉంటూ, స్థానిక మండల ప్రజా పరిషత్‌లో రెండు పర్యాయాలు ఎంపీటీసీ సభ్యునిగా వ్యవహరించారు.

ప్రయాణం.. నరకమే..

- ఎవరికీ పట్టని ట్రాఫిక్ సమస్య
- రాజానగరంలో మితిమీరిన ఆక్రమణలు
- నియోజకవర్గ కేంద్రంలో ప్రజల దుస్థితి



రాజానగరం గాంధీ బొమ్మ సెంటరులో ఆక్రమణలతో ఇరుకుగా మారిన రోడ్డు

రాజానగరం: నియోజకవర్గ కేంద్రంగా ఉన్న రాజానగరంలో రోజురోజుకూ తీవ్రమవుతున్న ట్రాఫిక్ సమస్యతో ప్రయాణికులు అనేక అవస్థలు పడుతున్నారు. గ్రామంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. వివిధ రకాల వ్యాపార లావాదేవీలకు స్థానిక గాంధీ బొమ్మ కూడలి ప్రాంతమే కీలకంగా మారింది. దీంతో ప్రధాన రోడ్డు ఆక్రమణలకు గురై, ఇరుకుగా మారింది. ఈ క్రమంలో నిత్యం ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో గాంధీ బొమ్మ సెంటరు నుంచి మార్కెట్ ప్రాంతం వరకున్న ఫర్లాంగు దూరాన్ని దాటాలంటే గంటల సమయం పడుతుందంటే ఇక్కడ ట్రాఫిక్ సమస్య ఏ స్థాయిలో ఉందో అవగతమవుతోంది.

300 ఏళ్ల నాటి మార్గాలే..

సుమారు 300 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన రాజానగరంలో ఆనాటి రోడ్డు మార్గాలు మినహా, వాటి విస్తరణ ఒక్క అంగుళం కూడా జరగలేదు. పూర్వం రావుల చెరువును ఆనుకుని రోడ్డు ఉండేది, కాలక్రమంలో చెరువుకు రోడ్డుకు మధ్య జనావాసాలు ఏర్పడ్డాయి. దీనితో వివిధ రకాల వ్యాపారాలకు ఇదే కేంద్రంగా మారింది. సుమారు రెండు వేల జనాభా ఉండే ఈ గ్రామంలో నేడు ఆ సంఖ్య 10 వేలకు పెరిగింది. మౌలిక సదుపాయాలు మాత్రం ఒక్క అంగుళం కూడా పెరగలేదు. ఈ నేపథ్యంలో ఈ రోడ్డులో ప్రయాణించే వాహనచోదకులు నిత్యం నరకం అనుభవిస్తున్నారు.


విచ్చలవిడిగా ఆక్రమణలు

జనాభా పెరుగుదలకు అనుగుణంగా రోడ్డును విస్తరించడం మాటెలా ఉన్నా, రోడ్డును కూడా కాపాడుకోలేని పరిస్థితులు ఇక్కడ నెలకొన్నాయి. 30 నుండి 35 అడుగుల వెడల్పుతో ఉండే రాజానగరంలోని ప్రధాన రోడ్డు, దశాబ్ద కాలం క్రితం వరకు జాతీయ రహదారిగా ఉండేది. పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకుని సూర్యారావుపేట నుంచి రాజానగరం శివారు శ్రీరామనగర్ వరకు బైపాస్ రోడ్డు నిర్మించారు. దీనితో అప్పటి వరకు జాతీయ రహదారిగా ఉన్న ఈ రోడ్డు కాస్తా ఆర్అండ్‌బీ రోడ్డుగా మారిపోయింది. అదే జాతీయ రహదారిగా ఉంటే విస్తరణ జరిగి ఉండేదని భావిస్తున్నారు. ఆర్అండ్‌బీకి అప్పగించిన తర్వాత రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణల అడ్డాగా మారింది. అసలే చిన్న రోడ్డు, ఆపై ఆక్రమణలు, వాహనాల పార్కింగ్‌లతో ఇరుకుగా తయారై రెండు బస్సులు ఎదురెదురు పడితే.. మోటారు బైకు కూడా దాటలేని దుస్థితి నెలకొంటోంది. పాదచారులు కూడా అడుగు ముందుకు వేయలేక అవస్థలు పడుతున్నారు.

కానరాని ట్రాఫిక్ నియంత్రణ

గ్రామంలో ఉన్న కాన్వెంట్లు, కళాశాలలతో నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో స్కూల్ బస్సులతో రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీనికితోడు మంగళ, శుక్రవారాల్లో జరిగే గ్రామ సంత సమయంలో ఈ సమస్య మరింత తీవ్రమవుతుంది. ఈ ప్రాంతానికి చేరువలోనే పోలీసు స్టేషన్ ఉన్నా కానీ, ఒక్క కానిస్టేబుల్ కూడా గ్రామంలో ట్రాఫిక్ నియంత్రణ డ్యూటీ చేసినట్టు కానరాదు. గతంలో మార్కెట్ ఏరియాలో, గాంధీ బొమ్మ సెంటరులో ఇద్దరు కానిస్టేబుళ్లు, ఒక ఎస్సై ట్రాఫిక్ నియంత్రణ డ్యూటీ చేసేవారు. ఇటీవల కాలంలో పోలీసు స్టేషనులో 50 మందికి పైబడి పోలీసు సిబ్బంది ఉన్నప్పటికీ, నియోజకవర్గ కేంద్రంగా ఉన్న రాజానగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించే చర్యలు తీసుకున్నట్టు దాఖలాల్లేవు. దీనితో ఆక్రమణలతో పాటు, వాహనాల పార్కింగ్‌కు ఈ పాత ఎన్‌హెచ్ రోడ్డే అడ్డాగా మారిపోయింది.

చర్యలు తీసుకుంటాం



గ్రామంలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించే దిశగా తగిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే పలుమార్లు పోలీసుల దృష్టికి తీసుకువెళ్లాం. మరోమారు పై అధికారులతో మాట్లాడి, అవసరమైన చర్యలు తీసుకుంటాం

– మేకా ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి, రాజానగరం

ఆక్రమణల్లోనే ఇక్కడ అభివృద్ధి



నియోజకవర్గ కేంద్రంగా ఉన్న రాజానగరం అభివృద్ధికి ఏనాడు నోచుకోలేదు. ఇక్కడ ఆక్రమణలే అభివృద్ధిగా సాగుతున్నాయి. ఆక్రమణలతో రోడ్డు ఇరుకుగా మారిపోతున్నా కానీ, ఓట్ల రాజకీయంతో ఏ రాజకీయ నాయకుడు వాటి జోలికి పోడు. అధికారులను పోనివ్వరు. పొరుగున ఉన్న కోరుకొండ, రంగంపేట, గండేపల్లి మండల కేంద్రాలు అభివృద్ధిలో దూసుకుపోతుంటే రాజానగరం ఆక్రమణలో దూసుకుపోతోంది.

– ఎస్.శ్రీరామచంద్రప్రసాద్, తూర్పు గానుగూడెం

వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి



వైద్య నిపుణులను సత్కరిస్తున్న పీఎంపీలు

రాజమహేంద్రవరం రూరల్: ప్రాథమికంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ, వైద్య సేవలందించే పీఎంపీలు వ్యాధులపై పూర్తి అవగాహన కలిగి ఉండటం ఎంతో మేలు చేస్తుందని ప్రముఖ గ్యాస్ట్రో వైద్య నిపుణుడు డాక్టర్ రామ్‌గోపాల్‌తేజ అన్నారు. మంగళవారం కమ్యూనిటీ పారామెడిక్స్–ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్(పీఎంపీ) వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హుకుంపేట గోదావరి రుచులు కాన్ఫరెన్స్ హాల్‌లో వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు జరిగింది. సంఘ రాజమండ్రి శాఖ అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్‌ఖాన్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి డాక్టర్ రామ్‌గోపాల్‌తేజ మాట్లాడుతూ జీర్ణాశయ వ్యాధులకు నేటి ఆహార అలవాట్లే కారణమన్నారు. జీర్ణ వ్యవస్థకు ఇబ్బంది కలిగించే క్యాన్సర్లు, కాలేయానికి వచ్చే కామెర్లు, వాటి ప్రాథమిక వైద్యం తదితర అంశాలను వివరించారు. గైనకాలజిస్ట్ డాక్టర్ బీఎస్ మాణిక్యాంబ(బాల) మాట్లాడుతూ గర్భకోశ వ్యాధులు, గర్భాశయ క్యాన్సర్లను వివరించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు బళ్లా శ్రీనివాసరావు, పి.చిన్ని, మట్టా రమేష్, యు.ప్రసాద్‌బాబు, ఎ.సురేష్‌బాబు, సుంకర శ్రీనివాస్, ఎం.బాబ్జీ, కె.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వైద్య నిపుణులను ఘనంగా సత్కరించారు.

ఉచిత కళ్లజోళ్ల పంపిణీ



కళ్లజోళ్లు అందజేస్తున్న చింతా ప్రసాదరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: సమాజంలో అవసరార్థులను గుర్తించి, వారికి సదుపాయాలు అందించడంలో స్వర్ణాంధ్ర సేవా సంస్థ సేవలు అభినందనీయమని విశ్రాంత స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మారిశెట్టి జితేంద్ర అన్నారు. మంగళవారం స్థానిక లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమం ప్రాంగణంలో ఉచిత కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఆయనతో పాటు, సీపీ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ అధినేత చింతా ప్రసాద్‌రెడ్డి లబ్ధిదారులకు కళ్లజోళ్లను అందించారు. ఇటీవల మరణించిన చింతా నాగప్రణవరెడ్డి జ్ఞాపకార్థం రూ.10 వేలను ఉచిత కళ్లజోళ్ల కోసం ప్రసాదరెడ్డి సమకూర్చారు. సంస్థ నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు మాట్లాడుతూ 26 ఏళ్లుగా తమ సంస్థ జిల్లాలో 1009 ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించినట్టు వివరించారు. ఈ నెల మూడున ఉచిత నేత్ర వైద్య శిబిరంలో గుర్తించిన 128 మందికి రూ.60 వేల విలువైన కళ్లజోళ్లు ఉచితంగా పంపిణీ చేశామన్నారు. 27 మందికి కంటి ఆపరేషన్లు చేయించి, నగదు సాయాన్ని సమకూర్చామన్నారు.

ఎస్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

కంబాలచెరువు: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నగర శాఖ నూతన కార్యవర్గం స్థానిక డీఎంహెచ్ స్కూల్‌లో మంగళవారం ఎన్నికైంది. సంఘ జిల్లా అధ్యక్షుడు డేనియల్ బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, ఆర్థిక కార్యదర్శి అర్జునుడు తదితరుల ఆధ్వర్యంలో ఈ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. జిల్లా కార్యదర్శిగా సేతు వేణుమాధవ్, నగర అధ్యక్షుడిగా ఎ.విశ్వేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా కె.సీతారామయ్య ఎన్నికయ్యారు. అలాగే నగర ప్రధాన కార్యదర్శిగా దాసరి శివసత్యమూర్తి, సహాధ్యక్షుడిగా కె.వెంకటేశ్వర్లు, ఆర్థిక కార్యదర్శిగా ఎస్.సుబ్రహ్మణ్యం, అదనపు కార్యదర్శులుగా ఎస్ఎస్ఎన్ ప్రసాద్, ఎస్.రవికుమార్, కార్యదర్శులుగా కేఎల్ఎస్ శాస్త్రి, ఎస్.సుబ్రహ్మణ్యం, పి.బాపిరాజు, కె.ఈశ్వర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. పలువురు సంఘ ప్రతినిధులు నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు.

విద్యుత్ ఉద్యోగుల నూతన కార్యవర్గ ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని సత్కరిస్తున్న నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాజమహేంద్రవరం సర్కిల్‌లో నూతనంగా ఏర్పడిన రాజమహేంద్రవరం రూరల్ డివిజన్ కార్యవర్గం సోమవారం రాత్రి ఏకగ్రీవంగా ఎన్నికైంది. సంస్థ గౌరవాధ్యక్షుడు కాశీమోహన్‌రావు, స్టేట్ సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్, సంస్థ కార్యదర్శి వెంకటేశ్వరరావు, స్టేట్ జనరల్ సెక్రటరీ అంబటి రాజారత్నం, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ తోట చినవెంకట్రావు, టౌన్ డివిజన్ ప్రెసిడెంట్ ముప్పిడి గణేష్ ఈ ఎన్నికలను పర్యవేక్షించారు. సంఘ రూరల్ డివిజన్ గౌరవాధ్యక్షుడిగా తుమ్మల తాతారావు, ప్రెసిడెంట్‌గా ఎంసీహెచ్ అప్పలరాజు, సెక్రటరీగా పిల్లి వైవీ ప్రసాద్, ట్రెజరర్‌గా కుసుమ శివప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం.మాధవరావు, పబ్లిసిటీ సెక్రటరీగా ఐ.దుర్గాప్రసాద్, అడిషనల్ సెక్రటరీగా నాగబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా శ్రీనివాస్, అసిస్టెంట్ సెక్రటరీగా రత్నరాజు, వైస్ ప్రెసిడెంట్‌గా సత్యనారాయణ ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సత్కరించారు.

చెరువు ఆక్రమణలు తొలగించాలి

రాజమహేంద్రవరం రూరల్: కోలమూరు పంచాయతీలోని కోదండరాముని చెరువు ఆక్రమణకు గురైందని, సర్వే చేసి చెరువు ఆక్రమణలను తొలగించాలని పలువురు బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి విజయారెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు.

నేటి నుంచి అక్కమ్మతల్లి జాతర

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్‌సిటీ గ్రామంలో ఉన్న గురజాల అక్కమ్మతల్లి జాతర మహోత్సవాలు బుధవారం నుంచి ఈ నెల 21 వరకు జరగనున్నాయి. ఈ మేరకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మంగళవారం ఇక్కడ వివరాలు వెల్లడించారు. బుధవారం ఉదయం ఆరు నుంచి పంచామృతాభిషేకాలు, సాయంత్రం 5 గంటలకు 108 ఘటాలతో ఊరేగింపు జరుగుతుందన్నారు. ఈ నెల 18న ఉదయం సహస్ర కమల పూజలు, 19న ఉదయం నుంచి కుంకుమ పూజలు, 20న లక్ష పసుపు కొమ్ములతో లక్ష్మీ పూజ, 21న ఉదయం 5 నుంచి అమ్మవారి దర్శనం, మధ్యాహ్నం 3.49 గంటలకు అమ్మవారికి ఊరేగింపు ఉంటుందని వివరించారు. ఇంకా ఈ సంబరాల్లో బాణసంచా, గరగనృత్యాలు, డప్పు వాయిద్యాలు, వేషధారణలు తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

పారిశుధ్య పనుల పరిశీలన



వేమగిరితోటలో పారిశుధ్య పరిస్థితులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కడియం: మండలంలోని వేమగిరి తోటలో నెలకొన్న పారిశుధ్య పరిస్థితులను ఎంపీడీఓ జి.రాజమనోజ్ మంగళవారం పరిశీలించారు. డ్రైనేజీల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా సెప్టిక్‌ట్యాంకర్ల సాయంతో తోడించేందుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. అలాగే అస్తవ్యస్థంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి, శాశ్వతంగా ముంపు సమస్య పరిష్కారానికి ప్రతిపాదనలు రూపొందించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

కడియం: ఆరోగ్యకర జీవనానికి పరిసరాల పరిశుభ్రత ముఖ్యమని వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. మండలంలోని దుళ్ల, వీరవరం గ్రామాల్లో పంచాయతీ, రెవెన్యూ, సచివాలయ, వైద్యారోగ్య, ఆశా, అంగన్‌వాడీ సిబ్బంది మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు, ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. పర్యావరణానికి ముప్పు తెచ్చే ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిరోధించాలన్నారు. స్వచ్ఛమైన ఆహార పదార్థాలే విక్రయించాలని దుకాణదారులకు సూచించారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చాకే తాగు నీటిని వినియోగించాలన్నారు. ఎక్కడా నీరు నిల్వ లేకుండా చూడాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి, అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ మేరకు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి ఆర్.వెంకటలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ వినీత, వి.ఐశ్వర్య, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.